కథ

# మరపురాని ప్రయాణం

సుదీర్ఘ ప్రయాణాలు కంపెనీ లేకుండా ప్రయాణించాలంటే ఎంతబోర్‌గా ఉంటాయో సమీర్‌కి అనుభవ పూర్వకంగా తెలిసొచ్చింది. ఫస్ట్‌క్లాస్ కూపేలో అతనొక్కడే వున్నాడు. విజయవాడ రాగానే దిగి వెళ్లి ఏ జనరల్ కంపార్టుమెంట్లోనో ఎక్కుదామనిపిస్తోంది. తలుపు దగ్గరకొచ్చి బయటికి చూశాడు.

ఆకాశం మేఘావృతమై వర్షం పడడానికి సిద్ధంగా వుంది. కాసేపట్లో విజయవాడ రానే వచ్చింది. జనాన్ని పరిశీలిస్తున్న సమీర్, ఎవరో తననే పరిశీలనగా చూడడం గమనించి చటుక్కున లోపలికి తప్పుకున్నాడు 'వెధవది! ఎక్కడా ప్రశాంతంగా వుండనివ్వరు గాబోలు' అనుకుంటూ. రైలు కదలడంతో మళ్లీ డోర్ దగ్గరకు వచ్చాడు.

ఇంతలో దూరం నుంచి భుజానికి జీన్స్‌బాగ్‌తో ఆదరాబాదరా పరిగెడుతూ వచ్చిన ఓ అమ్మాయి, రైలు వేగం అందుకోవడంతో సమీర్ నిలబడి వున్న కంపార్టుమెంట్ కమ్మీని పట్టుకుని ఒక వూపులో ఎక్కేసింది. ఆ దెబ్బకి సమీర్ తూలినట్లయి నిలదొక్కుకున్నాడు.

ఆ అమ్మాయి "వుస్" అంటూ తలవిదిలిస్తూ "సో సారీ" అంది సమీర్ వైపు చూసి ఫార్మల్‌గా.

"కొంచెం ముందొస్తే మీ సొమ్మేం పోయిందండీ" అన్నాడు కోపంగానే. నిజానికి ఆమె రైలెక్కిన క్షణంలో జారి పడిపోతుందేమో అన్నంత భయం వేసింది.

"య్యా, రావాలనే అనుకున్నాను. బట్, దార్లో కారు ట్రబులిచ్చి, లేటైంది. నిజానికి నేనెక్కాల్సిన కంపార్టుమెంట్ ఇది కాదు. మధ్యలో ఎక్కడ ఆగుతుందో తెలీదు. ఆగినప్పుడు దిగి వెళ్లిపోతాన్లెండి" అంది భుజాలమీద నుంచి ముందుకు పడుతున్న జుట్టును వెనక్కి తోసుకుంటూ.

"అక్కర్లేదు. టి.సి వస్తే ఎలాగో మానేజ్ చేయొచ్చులెండి" అన్నాడు అప్రయత్నంగా, దొరికిన ఒక్క కంపెనీ చేజారిపోతుందేమోనని. ఆ అమ్మాయి నవ్వింది కొంచెం నిర్లక్ష్యంగా.

"థాంక్యూ, బైదిబై ఐయామ్ మైత్రి, మే ఐ నో యువర్ గుడ్‌నేమ్?" అంది షేక్‌హాండ్‌కి చేయిజాస్తూ.

ఆ మాటతో సమీర్‌కి ఆ పిల్ల తనని గుర్తుపట్టలేదని అర్థమైపోయింది. నిజంగా గుర్తుపట్టలేదా? లేక నటిస్తోందా? క్రికెట్ చూడదా ఏమిటి? ఆ జీన్సు పాంటూ, హేర్ డ్రెస్సింగ్ చూస్తే, డైరెక్టుగా స్టేడియానికొచ్చి గ్యాలరీలో కూచుని గోలచేస్తూ క్రికెట్ ఎంజాయ్ చేసేలా కనిపిస్తోంది. మరి ఎందుకు గుర్తుపట్టలేదు? పోనీ తనేమైనా సినిమా యాక్టరా మేకప్ లేనిదే గుర్తుపట్టడం కష్టమనుకోవడానికి! తనంటేనే క్రికెట్ వరల్డ్‌లో పెద్ద సంచలనం! అదీగాక ఈమధ్య ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే మ్యాచ్ సిరీస్‌లో, ప్రతి మ్యాచ్‌లోనూ, సెంచరీలతో అదరగొట్టాడు కూడా! మరి ఈవిడ తన మొహమే ఎరగనట్టు చూస్తోంది. డామిట్! ఇరవయ్యేళ్ల వయసులో వుండి క్రికెట్ చూడకపోవడమేంటసలు!

"మనమింక కూచుందామా?" ఆమె గొంతుతో ఉలికిపడి "యా, అయాం సమీర్" అన్నాడు. అంత కుమిలించి పరిచయం చేసుకోవడం అవమానంగా తోచింది.

మైత్రి తనని గుర్తుపట్టకపోవడాన్ని సమీర్ భరించలేకపోతున్నాడు. ఆటోగ్రాఫ్ పుస్తకాలు పట్టుకుని తొక్కుకుంటూ, తోసుకుంటూ తన చుట్టూ మూగే అభిమానుల మీద ఒక్కోసారి తనకే విసుగేస్తుంటుంది. అలాంటిది యివాళ ఈ అమ్మాయి ముందు తన ఐడెంటిటీ గాల్లో కొట్టుకుపోయింది. ఎలాగైనా ఆ అమ్మాయి తనని గుర్తుపట్టేట్లు చేయాలనిపిస్తోంది. ఎలా?

"నైస్ నేమ్" అంటూ కూచుని బాగ్‌లోంచి ఏదో తినుబండారాలు బయటికి తీసింది. సమీర్‌కి యింకా ఆశ్చర్యంగానే వుంది!

"బయట వర్షం కురుస్తోంది" అంది పేపర్ ప్లేట్లో కారప్పూస పెడుతూ.

"అవును! వర్షం పడుతున్నపుడు, రైలు ప్రయాణం చాలా తమాషాగా వుంటుంది. ఐ లైకిట్" అన్నాడు సమీర్ రైలు చప్పుడుతో కలిసిపోతున్న వర్షం చప్పుడును పసిగట్టాలని ప్రయత్నిస్తూ.

"అవును. యిలాంటపుడు మంచి కాఫీ తాగడం నాకి[illegible] యిష్టం" అంటూ ఫ్లాస్క్‌లోనించి కాఫీ డిస్పోజబుల్ కప్పుల్లో పోసి ఒకటి సమీర్‌కి యిచ్చింది మైత్రి.

"ఓ.. కాఫీ? థాంక్ యూ వెరీమచ్" అంటూ అందుకున్నాడు.

"పదండి! అలా డోర్ దగ్గర నిలబడి తాగుదాం" అంది లేస్తూ. మసక చీకట్లలో, తడితడిగా కదిలిపోతున్న చెట్లను చూస్తూ కాఫీ తాగడం గమ్మత్తు అనుభవంగా తోచింది సమీర్‌కి.

"అబ్బ, వర్షంలో తడిసిన ఆకులు ఎంత బాగున్నాయో కదూ! అసలు వర్షం కురిసి వెలిసిన తర్వాత చూడండి. కొండలు, చెట్లూ, రోడ్డూ అన్నీ తలారా స్నానం చేసినట్టు ఎంత ఫ్రెష్‌గా వుంటాయో! తలారా స్నానమేగా వర్షం అంటే!" అని నవ్వింది మైత్రి.

"అదే వె[illegible]గానీ. కాఫీ మాత్రం చాలా బాగుంది" అన్నాడు సమీర్.

"థాంక్యూ, నేనే కలిపాను! అది సరే-ఎందాకా మీరు?" అంది మైత్రి.

"వైజాగ్"

"నేను రాజమండ్రి! మా అత్తయ్యా వాళ్ళింటికి వెళుతున్నాను. మీది హైద్రాబాదా?"

"అవును"

"మాది ప్రాపర్ గుంటూరు. కానీ నా స్టడీస్ చిన్నప్పటి నుంచీ హైద్రాబాద్‌లోనే జరిగాయి. అందువల్ల నాకు హైద్రాబాద్ బాగా తెలుసు" అంది.

పెరిగిందీ, చదువుకుందీ హైద్రాబాద్‌లో అయ్యుండి తనెవరో తెలీదంటే ఏమనుకోవాలో సమీర్‌కి అర్థం కాలేదు.

మళ్లీ తనే అంది "నేనిప్పుడు ఎం.బి.ఎ చేస్తున్నాను. మీరు?"

అతనికేం చెప్పాలో తెలీలేదు. అతని బాటింగ్ చూడ్డానికి క్లాసులెగ్గొట్టి టీవీలకి అతుక్కుపోయే ఫాన్స్ లక్షల్లో వున్నారతనికి. ఈ పిల్లేమో "వాట్ యూ ఆర్?" అనడుగుతోంది.

"సెంట్రల్ బ్యాంక్‌లో పన్జేస్తున్నాను" అన్నాడు. యిలా ఉద్యోగం చెప్పుకోవడం యిదే మొదటిసారి!

"ఐ సీ" అంది యధాలాపంగా! అతడు కప్పును బయటకు విసిరెయ్యబోతుంటే "నో, యిలా యివ్వండి" అంటూ తీసుకుని డస్ట్‌బిన్‌లో పడేసింది.

మైత్రి తనని గుర్తు పట్టకపోవడాన్ని సమీర్ భరించలేకపోతున్నాడు. ఆటోగ్రాఫ్ పుస్తకాలు పట్టుకుని తొక్కుకుంటూ, తోసుకుంటూ తన చుట్టూ మూగే అభిమానుల మీద ఒక్కోసారి తనకే విసుగేస్తుంటుంది. అలాంటిది యివాళ ఈ అమ్మాయి ముందు తన ఐడెంటిటీ గాల్లో కొట్టుకుపోయింది.

ఎలాగైనా ఆ అమ్మాయి తనని గుర్తుపట్టేట్లు చేయా

అనిపిస్తోంది. ఎలా? ''మీ హాబీ లేంటి'' అన్నాడు పెళ్ళి చూపుల్లో అడిగే చెత్తరకం ప్రశ్నలా! ''బుక్స్, మ్యూజిక్! సమ్ టైమ్స్-కారమ్స్ ఆడతాను'' అంది ''చెస్ కూడా''

''గేమ్స్, స్పోర్ట్స్ లాంటివి?'' అన్నాడు.

''చెప్పానుగా, చెస్, క్యారమ్స్ ఆడతాను! టీవీలో అయితే, టెన్నిస్ చూస్తాను. అదీ గ్రాండ్ స్లామ్ టోర్నమెంట్స్ జరిగినప్పుడు'' అంది.

''క్రికెట్ చూడరా'' గుండె చిక్కబట్టుకుని అడిగాడు.

''నో'' నిర్ద్వంద్వంగా చెప్పింది.

''ఎందుకు? జనరల్‌గా మీ ఏజ్ గ్రూప్ వాళ్లంతా క్రికెట్ మీద క్రేజ్ చూపిస్తారుగా'' అన్నాడు ఏం చెబుతుందో వినాలని.

''అయితే! నేనూ చూపించాలా? నాకు భలే తలనొప్పి క్రికెట్ అంటే! ఆయనెవరో అన్నట్టు 'ఇరవై రెండు మంది మూర్ఖులు ఆడుతుంటే - వేల కొద్దీ మూర్ఖులు చూసే ఆట క్రికెట్' అనీ-సరిగ్గానే చెప్పాడు. ఎంత వేస్టాఫ్ టైమండీ బాబూ! నేనస్సలు చూడను. ఎప్పుడో కపిల్‌దేవ్, గవాస్కర్ ఆడినప్పుడు-అప్పుడు చాలా చిన్నదాన్నిలెండి! ఒకసారో రెండుసార్లో చూసుంటానండీ! బహుశా అప్పుడు నాకర్థమై వుండదు. అదే కంటిన్యూ అయిపోయిందేమో! ఎనీ హౌ ఐ హేట్ క్రికెట్. అసలు మన టీంలో ఎవరెవరున్నారో కూడా నాకు తెలీదంటే నమ్మండి'' అంది కాజువల్‌గా.

''నిజంగా?'' అన్నాడు సమీర్ నిజంగానే ఆశ్చర్యంగా.

''నిజంగానే! ఇంకో విషయమేంటంటే మా యింట్లో నేను తప్ప అందరూ మా మమ్మీ, డీ, మా తమ్ముడు అంతా క్రికెట్ పిచ్చోళ్లే! ఏ వర కప్పో వచ్చినపుడు చూడాలి మా డ్రాయింగ్ రూం గో త్తిపోతూ వుంటుంద నుకోండి! మా తమ్ముడి ఫ్రెండ్స్ డా వచ్చి చేరతారు. యిహ చూస్కోండి! ఒకటే కేక ం, అరుపులు! నా మటుకు నేను హాయిగా మేడమీ నా గదిలో వాక్‌మన్



పెట్టుకుని, కిందిగోల వినిపించకుండా పాట వింటూ గడిపేస్తా'' అంది.

అంత మాట్లాడాక తను ఫలానా అని తెలీకపోవడం మం ది అనిపించింది సమీర్‌కి.

మీరు క్రికెట్ ఫాన్‌లా వున్నారే చూడబోతే'' అంది వున్నట్టుండి మైత్రి.

సమీర్‌కి నవ్వొచ్చింది. 'క్రికెట్ ఫానా! తను?

''అవును! ఐ లవ్ క్రికెట్'' అన్నాడు మనస్ఫూర్తిగా.

మైత్రి నవ్వింది!

''పుస్తకాలేవీ చదవరా? టెన్నిస్ యిష్టం లేదా మీకు'' అంది.

''టెన్నిస్ కూడా యిష్టమే! కానీ క్రికెట్ అంత కాదు'' అన్నాడు.

''వాటెబవుట్ చెస్!''

వి.ఎల్.సుజాత

"ఐ డోంట్ నో చెస్" .

"చెస్ ఆడాలంటే మెదడు, తెలివితేటలు వుండాలండీ! టెన్నిస్‌కి కూడా! కాని క్రికెట్‌కి యివేవీ అక్కర్లేదు. ఒట్టి ఫూల్స్‌గేమ్. కానీ తమాషా చూశారా! మన దేశంలో ఒక క్రికెటర్‌కి వున్న ఫాన్స్‌లో పదోవంతు కూడా చెస్ ప్లేయర్స్‌కి వుండరు" అంది కోపంగా.

సమీర్‌కి ఒళ్లు తెలియనంత కోపం వచ్చింది.

"యిప్పుడేమంటారైతే! క్రికెట్ ఆడేవాళ్లకి మెదళ్లుండవా" అన్నాడు. "మీక్కోపం వచ్చినట్టుంది. సర్లెండి, క్రికెట్ ప్లేయర్స్‌కీ మెదళ్లుంటాయి! ఏదీ నవ్వండొకసారి"

నవ్వొచ్చింది నిజంగానే సమీర్‌కి.

ఏమిటో ఈ పిల్ల! భలే విచిత్రమైన అమ్మాయే! తను చేసే సెంచరీలపై లక్షల్లో పందేలు కాసేవాళ్లున్నారు. తను ఆటోగ్రాఫ్ యిస్తూ, చిరునవ్వు నవ్వితే పడిచచ్చిపోయే అమ్మాయిలున్నారు. చేతో షేక్‌హ్యాండ్ చేస్తే చాలనుకునే కాలేజీ అమ్మాయిలున్నారు. ఇప్పుడిప్పుడే క్రికెట్ నేర్చుకునేవాళ్ల 'ఐడియల్ హీరో' తను. ఒక్క ఎడ్వర్‌టైజ్‌మెంటన్నా తనతో చేయించుకోవాలని, తన అప్పాయింట్‌మెంట్ కోసం పడిగాపులు కాసే బిజినెస్‌మెన్.

ఇంతమంది వున్నా- యింతవాడు ఈ అమ్మాయి 'నువ్వెవరో తెలియదు పొమ్మంది.

సమీర్ అశాంతిగా కూచున్నాడు.

ఈలోపు ఆ అమ్మాయి పడుకుంటూ "సర్లెండి, నాకు నిద్రొస్తోంది. రాజమండ్రి రేపు టీసీ వస్తే మేనేజ్ చేయాల్సింది మీరే! ఎందుకంటే నాకు నిద్రపట్టిందంటే మరి మెలకువ రాదు! గుడ్‌నైట్! పడుకోండి మీరు కూడా! పదిన్నరవుతోంది" అంటూ ఉచిత సలహా పారేసి ముసుగు పెట్టేసింది.

సమీర్‌కి నిద్ర రావడంలేదు. కాసేపు మైత్రినే చూస్తూ కూచున్నాడు! రైలు రాజమండ్రి చేరే సమయానికి అలారం సెట్ చేసి పెట్టుకున్నట్లుంది మైత్రి తల పక్కనే వుంది.

తనూ నడుం వాల్చి కళ్లు మూసుకున్నాడు.

★★★

చటుక్కున మెలకువ వచ్చింది సమీర్‌కి. ఏదో స్టేషన్ వచ్చినట్లుంది. కొంపదీసి రాజమండ్రా? మైత్రిని లేపుదామనుకుంటూ కంగారుగా చూశాడు.

ఎదురుబెర్తు ఖాళీగా వుంది. దిగేసిందా? తనని లేపకుండానే- కనీసం చెప్పనైనా చెప్పకుండానే దిగిపోయిందా? నిజానికి ఆమె దిగిపోయేటపుడు తనెవరో చెప్పి ఆశ్చర్యపోయేలా చేయాలనుకున్నాడు.

కానీ- ఆ అమ్మాయేమో-

ట్రెయినింకా కదల్లేదుగా!

స్టేషన్లో కనబడుతుందేమో

అనుకున్నదే తడవుగా లేచి డోర్ దగ్గరికొచ్చాడు. స్టేషనంతా కలయజూస్తుండగా చివరగా కనిపించింది మైత్రి. ఆమె పక్కన మరో యువకుడున్నాడు. అతడికి నవ్వుతూ చేతులు వూపేస్తూ ఉత్సాహంగా ఏదో చెబుతోంది మైత్రి. అంతలో తమ కంపార్ట్‌మెంట్‌కేసే చేయి చూపిస్తోంది ఎందుకో!

సమీర్ మైత్రి తనని చూస్తుందా లేదా అని ఆత్రుతతో చూశాడు. ట్రయిన్ కదిలింది.

మైత్రి కంపార్టుమెంట్ వైపు డోర్ దగ్గర నిలబడ్డ సమీర్‌వైపు చూసి సంతోషంగా చేయి వూపింది. సమీర్ వెంటనే చేయి వూపాడు. ఆమె పక్కనున్న యువకుడి మొహంలో సంభ్రమాశ్చర్యాలు చోటుచేసుకున్నాయి.

ట్రెయిన్ వేగం పుంజుకుని స్టేషన్ దాటింది.

సమీర్ లోపలికొచ్చి కూచున్నాడు. దుప్పటి సర్దుకుని పడుకోబోతుండగా తలగడకి పిన్ చేసి వున్న కాగితం కనిపించింది. గబుక్కున ఏదో స్ఫురించినట్లయి తీసుకుని విప్పాడు. ముత్యాలు కూర్చినట్లు తెలుగక్షరాలు!

సమీర్-

ఇటువంటి రోజొకటి నా జీవితంలో వస్తుందని నేనూహించలేదు. నేను పిచ్చిగా అభిమానించే క్రికెట్ ఆటగాడిని అడుగు దూరంలో చూస్తానని, అతడితో కలిసి ప్రయాణం చేస్తానని అసలనుకోలేదు. అసలది జరిగే పనేనా! కానీ జరిగింది. ట్రెయిన్ ఎక్కుతున్న క్షణంలోనే మిమ్మల్ని గుర్తుపట్టేశాను. గుండె ఒక్కసారిగా గొంతులోకి వచ్చి మాట్లాడలేకపోయాను. ఎలా మాట్లాడాలో తెలీలేదు. వెంటనే నన్ను నేను కంట్రోల్ చేసుకున్నాను! మీకు కొన్ని లక్షలమంది అభిమానులు, ప్రత్యేకంగా వాళ్లలో అమ్మాయిలు వుండొచ్చు. నిజానికి వాళ్లల్లో నేనూ ఒకదాన్నే. మీ బ్యాటింగ్ అంటే నాకు ఎంత యిష్టమో చెప్పడం చాతగావడంలేదు. మిమ్మల్ని ఎంతగా అభిమానిస్తానంటే మీరొకసారి మా యింటికి వస్తే గోడలకి ఎవరి పోస్టర్లుంటాయో చూసి మీరే తెలుసుకోవచ్చు. టీవీలో మీ మ్యాచ్ వుందంటే అందరికంటే ముందు టీవీని కౌగలించుక్కూర్చుంటాను. మీతో ప్రత్యేకంగా ఎలా మాట్లాడాలి? "సమీర్‌గారూ మీరా? నిజంగా నమ్మలేకపోతున్నాను. మీతో కలిసి ప్రయాణం చేయడం ఎంత థ్రిల్లింగ్‌గా వుందో! మీ బాటింగ్ అంటే పడి చస్తాను" అని నేనంటాననుకోండి. మీరు యిలాంటి డైలాగులు కొన్ని వేలసార్లు వినేసి వుంటారు కాబట్టి "ఐసీ, థాంక్యు" అని నవ్వేసి ఊరుకుంటారు. నేనేమో మీరు మొదటి సిక్సర్ ఎప్పుడు కొట్టింది, మీ అభిమాన నటుడెవరు? అభిమానుల్లో మీకెదురయ్యే యిబ్బందులేంటి లాంటి ప్రశ్నలేస్తాను. మీరు ఈ మోనోటనస్ ప్రశ్నలకు, విసుగును దాచిపెట్టి ముక్తసరిగా సమాధానాలు చెబుతారు. తర్వాత నేను అత్యంత ప్రాణప్రదంగా మీ ఆటోగ్రాఫ్ తీసుకుంటాను దిగేముందు! మన పరిచయం యిలా ముగియడం నాకిష్టం లేదు. మీ జ్ఞాపకాల్లో నేనొక తమాషా అనుభవంగా మిగిలిపోవాలి! మిమ్మల్ని గుర్తుపట్టనట్లు నటించాను. నిజానికి మీరెంత ఫీలయ్యారో గమనిస్తూనే వున్నాను.

అందుకే మీ జ్ఞాపకంగా మీరు కాఫీ తాగిన కప్పును తీసుకుపోతున్నాను. అంతేకాదు మీరు రాసిన 'బ్యాటింగ్ టెక్నిక్స్' పుస్తకాన్ని కూడా! యిది సరికొత్త కాపీ కదూ! యింకా మార్కెట్లోకి రిలీజ్ కాలేదు. మీరు చదువుతూ చదువుతూ పక్కన పెట్టినట్లున్నారు. మీ అనుమతి లేకుండా తీసుకుంటున్నందుకు క్షమించండి. మరి మావాళ్ళంతా నమ్మద్దూ! మధురమైన ఈ ప్రయాణాన్ని మరపురాని అనుభవంగా నా డైరీలో పదిలపరచుకుంటాను చెరిగిపోని సువర్ణాక్షరాలతో!

మళ్లీ ఎప్పుడో- ఎక్కడో, యిలాగే కలుసుకుందాం!

థాంక్ యూ!

-మైత్రి"

★




